# చిట్టి

కోకా బాలకృష్ణారావు

చిట్టి పెళ్ళి అయిపోయింది.

ఇది దశరథరామయ్య, నెత్తిన మోస్తున్న పెద్దబరువు దిగిపోయినట్లు, హృదయంలో ఆనందవాహిని కట్టలు తెంచుకొని, కనుకొలకుల్లో నించి దర్శనమిచ్చినప్పుడు, తృప్తిగా, జీవితంలో ఒక భారతరమైన కర్తవ్యం నెరవేర్చుకున్నట్లు నిట్టూర్చి అనుకున్న మాట

చిట్టి వెళ్ళిపోతుంది—

ఇది సుభద్రమ్మ విచార భారంతో పూడుకుపోయిన గొంతుతో లోలోన అనుకున్న మాట.

ఇక చిట్టి జీవితం ఎట్లాసాగుతుందో ?

ఇది పెద్దక్క వేసుకున్న జవాబు లేని ప్రశ్న.

పోతే:—మిగిలిన చిన్న పిల్లలందరికీ చిట్టి పెళ్ళి ఇంకా కళ్ళముందు జరుగుతున్నట్టే తోస్తోంది.

ఇంటిముందు పందిరన్నా యింకా వూడదీయలేదు.

చిట్టి కాళ్ళపారాణి సర్తన్నా యింకా మాసిపోలేదు.

అసలు పెళ్ళి సందడే యింకా తగ్గలేదు.

పదహారు రోజుల పండుగ వెళ్ళింది. చిట్టి జీవితంలో ముఖ్యమైన రెండవఘట్టం కూడా అప్పుడే ముగిసింది—

కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

చెల్లెలు జయ చిట్టి చెవులకి తాటాకులు కట్టటం మొదలు పెట్టింది.

ఏదో ఆలోచనలో కంచంలో అన్నం కెలుకుతున్న చిట్టిని చూసి "ఇంక ఎట్లా సయిస్తుంది. పాపం...ఆయన వెళ్ళిపోయాడుగా"

చిట్టికి నిజంగా కోపం వచ్చింది. మహా తన మనసులో దూరిచూసినట్టు దానికి ఆ మాట లేమిటి ?

కోపం పైకి ప్రదర్శిస్తే తనని ఇంకా ఏడిపిస్తారు.

అన్నం సయించటం లేదు ఎందుచేతో. కంతానికి నోట్లో కుక్కుకోటం మొదలు పెట్టింది.

రాత్రల్లా నిద్రలేదు. కళ్ళు మూసుకుపోతున్నాయి. దేనిమీదా ఇచ్ఛలేదు. ఒళ్ళంతా నీరసంగా వుంది. అది పైకి కనబడనీయకుండా వుండటానికి చిట్టి ఎంతో ప్రయత్నించింది.

ఎట్లాగైతేనేం భోజనాలయ్యాయి.

చెయ్యి కడుక్కొని, కాస్త వక్కపొడి వేసుకొని, గదిలో మంచంమీద వాలింది చిట్టి. గదిలో ఒకమూలగా పడివున్న సిగరెట్టు పీకలు, కుమ్మందగ్గర పడివున్న ఖాళీ సిగరెట్టు పెట్టె డొక్కులు, చిలక్కొయ్యకి వేళ్ళాడుతున్న పంచ, మంచం ప్రక్కగా క్రింద రాలివున్న సిగరెట్టుబుసి, ఇంకా ఏవేవో ఒక్కసారిగా చిట్టికళ్ళకి కట్టినట్టు కనిపించాయి.

కాసేపు ఆలోచించింది దేన్నిగురించో. అప్పుడప్పుడే కాస్త కాస్తగా అలుముకుంటున్న మగతవల్ల కంటిపాపలమీద ఏదో పన్నని తెర కప్పినట్లుగా అయి, క్రమంగా కంటికి కనిపించే, ఎదటివస్తువులు అదృశ్యమై, తనకి తెలియకుండానే కళ్ళు మూసుకుపోయాయి.

బయట మాటలు అక్కడక్కడా వినిపిస్తూనే వున్నాయి.

ఇంతలో మంచంమీద దభేల్నవచ్చి కూలబడ్డ ధ్వని. కళ్ళుతెరిచిచూస్తే జయ.

జయ మంచంమీద సాఫీగా పడుకొని, చిట్టి నడుంచుట్టూ చెయ్యిపోనిచ్చి "ఇకనుంచి నే పడుకుంటాలే. నిశ్చింతగా నిద్రపో" అంది. ఆ పరిస్థితిలో ఏమైనా జవాబు చెపితే చిట్టిని యింకా ఉడికిస్తుంది జయ ఆ సంగతి బాగా తెలిసిన చిట్టి "ఊఁ" అని మాత్రం దీర్ఘం తీసి, ఊరుకుంది.

ఇంతలో చివరి చెల్లెలు 'బుడ్డి' వచ్చింది. "ఊఁ...లే...ఇది బావగారి పక్క... ఇక్కడ్లే" అంటూ జయని ముట్టడించింది.

"ఉండవే...నీదొక తగలాటం" అని జయ బుడ్డిని వదిలించుకోబోయింది. కాని అదిజేసి. తన ప్రయత్నం ఫలించక పోవటంతో చివరిసారిగా రాగాలు మొదలు పెట్టింది బుడ్డి. ఇక లేవక తప్పలేదు జయకి. ముద్దుగా రెండు అంటించి, విసురుగా తలుపువేసుకు వెళ్ళింది జయ.

బుడ్డి మెల్లగా చిట్టిపక్కలో చేరింది. బుడ్డికి రోజూ చిట్టెక్కదగ్గర కాని నిద్రపట్టదు. కృష్ణమూర్తి ఇక్కడవున్నన్నాళ్ళూ "చిత్తెక్క చిత్తెక్క" అని ఏడ్చేది. వాళ్ళమ్మ గొడ్డికుమ్మంలో పక్కేసుకొని, ఎట్లాగో యీ నాలుగురోజులూ బుడ్డిని పగ్గాలతో కట్టేసింది.

ఇక ఇప్పుడు బుడ్డికి స్వాతంత్ర్యం వచ్చినట్టే.

కాని అది తాత్కాలికమని బుడ్డికి తెలీదు. నిజంగా, ఈ యింటిని, ఈ ఇంట్లో అందర్నీ, ఈ ఇంటికి సంబంధించిన ప్రతి వస్తువునీ, చివరికి తననుకూడా విడిచిపెట్టి చిట్టెక్క ఒకనాడు వెళ్ళిపోతుందని గనక బుడ్డికి తెలిస్తే ఏం జరుగుతుందో ఊహించటం కష్టం.

అప్పటికే పూర్తిగా నిద్రలోపడిపోయిన చిట్టిగడ్డంపట్టుకొని ఇటూ, అటూ ఊపింది బుడ్డి. చిట్టి మగతలో బలవంతంగా కళ్ళు తెరిచింది విసుక్కుంటూ. "చిత్తెక్కా—చిత్తెక్కా ఆ గౌను తొలగవే" అంటూ గారాం చేసింది. "ఇప్పుడు కాదులే" అని విదిలించి చిట్టి అటువైపు తిరిగి పడుకుంది. కాని బుడ్డి వదల్లేదు చివరికి విసిగి, చిట్టి లేచి, పెట్టెలో ఆ గౌను తీసి, దాని ముఖం మీద పడేసి, మళ్ళీ పక్కమీద వాలింది.

బుడ్డి ఆ గౌను పట్టుకొని వంటింట్లో అమ్మదగ్గరికి పోయి "తొలగవే" అంటూ మళ్ళీ గారాలు మొదలు పెట్టింది.

అది ఊరినుంచి కృష్ణమూర్తి బుడ్డికి తెచ్చిన గౌను. దానిమీద కుట్టి ఉన్న "ఎంబ్రాయిడరీ" పువ్వుని చూసి బుడ్డి ఎంతో మురిసిపోయింది

ఆ గౌను తొడుక్కొని బావగార్ని తలుచుకొంటూ, ఆ నాలుగు రోజులూ బావ

★ చిట్టి ★

గారు వుండి వెళ్ళిన గదిలోకి ఎవరూ రాకుండా, ఆ గదిలో పక్క మీద ఎవరూ పడుకోకుండా పహారా యిస్తూ వుంటుంది బుడ్డి. దానికి, ఆ పక్క మీద బావగారు తప్ప యింకెవ్వరూ పడుకోకూడదని ఉద్దేశ్యం. ఈవిషయంలో దాని అభిప్రాయానికి ఎవరైనా అడ్డువస్తే తన చివరి ఆయుధంగా శోకాలు మొదలు పెడుతుంది. దాంతో వ్యవహారం నిరాటంకంగా చక్కబడుతుంది.

*   *   *

సాయంత్రం నాలుగు గంటలకి చిటి మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చింది. కళ్ళు తెరిచి బయటికి వచ్చేటప్పటికి, అప్పుడే వర్షంకురిసి వెలిసిన ఛాయలు కనిపించాయి బయట. పగటిపూట ఇంతగాఢమైన నిద్ర ఎప్పుడూ పట్టలేదు చిటికి.

ఇంట్లో ఎక్కడా మనుషుల సందడి లేదు. తల్లి ఒక్కతే వంటింట్లో ఏదో పని చేసుకుంటోంది జయ, పెద్దక్క వీధి బావి దగ్గర్నించి ఇంట్లోకి కావలసిన నీళ్ళు జార బోస్తున్నారు. పిల్లలందరూ ఆడుకోటానికి వెళ్ళారు బయటికి.

వెళ్ళి వంటింటి గుమ్మంమీద కూర్చుంది చిట్టి.

"అట్లా గుమ్మంమీద కునుకుతూ కూర్చోబోతే కాస్తస్నానంచేసి జడవేసుకోరాదూ."

చిట్టి ఒకసారి బద్ధకంగా వొళ్ళు విరుచుకొని లేచి గబగబా కార్యక్రమంలో మునిగిపోయింది.

*   *   *

రాత్రి ఏనిమిది గంటలైంది. చుట్టూ వ్యాపించిన జిమ్ముమనే చీకటిలోకి, బస్సులోనించి దిగాడు కృష్ణమూర్తి - గతుకుల రోడ్డుమీద ఒంటరిగా తెలిసీ తెలియని దారిలో ప్రయాణం.

రోడ్డుకు రెండువైపులా వున్న చెరుకు తోటల్లోనించి కీచురాళ్ళధ్వని...రోడ్డు బారున వ్యాపించిన తాటిచెట్ల చుట్టూ తిరిగే మిణుగురుపురుగుల మెరుపులూ...కంటికి కనిపించని అపరిచితమార్గం—

పెద్ద రోడ్డుదిగి, అడ్డరోడ్డువెంట గమన వేగం హెచ్చించి నడవటం మొదలు పెట్టాడు. చీకటి అంత కంతకీ ముదిరిపోతోంది. మాటి మాటికీ 'బ్యాటరిలైటు' వెలుగులో చేతిగడియారం చూసుకుంటున్న కృష్ణమూర్తికి సెకండ్లముల్లు స్థానంలో నిమిషాలముల్లు నించున్నట్టుంది.

వాకిటిగుమ్మంలో అడుగుపెడుతూ మళ్ళీ గడియారం చూశాడు. తొమ్మిదిన్నర అయింది. అంతవరకూ అల్లరిచేస్తూనే వున్న రాముడు, జగన్నాథం చూసి, "గడియారం బాబాయి" అంటూ ఎదురు వచ్చారు. వాళ్ళిద్దరి హడావిడీ విన్న తరువాత ఇంట్లో కూడా ఒక చిన్న కలకలం బయలుదేరింది

బయట జిమ్ముమనే చీకటిచూసి చిట్టి భయపడింది. ఈ చీకటిలో, ఇంతదూరం, సరిగా తెలీనిమార్గంలో కృష్ణమూర్తి తన కోసం వచ్చాడు.

చిట్టిహృదయంలో గర్వం తొంగి చూసింది.

రాత్రి కృష్ణమూర్తి చెప్పాడు "నీకోసం ఇంతరాత్రి చీకట్లో వచ్చాను" అని. చిట్టి నిర్లిప్తంగా వూరుకుంది.

తెల్లవారింది. మాటిమాటికి ఎదట మసిలే చిట్టిని కృష్ణమూర్తి దగ్గిరికి పిలవటం, తను తప్పించుకొని పారిపోవటం. పట్టపగలు యింతమంది వుండగా ఆ చేష్టలు ఎవరైనా చూస్తారని చిట్టిభయం.

ఆ రాత్రికూడా మామూలుగా గడిచిపోయింది. మళ్లీ తెల్లవారింది. కృష్ణమూర్తి బట్టలు సర్దటం మొదలుపెట్టాడు. చిట్టికి అర్థంకాలేదు. గుడ్లప్పగించి చూస్తున్న చిట్టిని తనే దగ్గిరికి పిలిచి చెప్పాడు కృష్ణమూర్తి.

"నాకు బదిలీ అయింది. రేపేవెళ్లి ఉద్యోగంలో చేరాలి"

చిటి ఒక్కసారిగా ఆశ్చర్యపడింది. ఆమెగుండెలు దడదడా కొట్టుకోటం మొదలుపెట్టాయి. మెల్లగా కుర్చీలో కూలబడింది. కృష్ణమూర్తి దగ్గరగా వచ్చాడు.

"ఈ విషయం నిన్ననే ఎందుకు చెప్పలేదు?"

"హఠాత్తుగా చెప్పి నీకు ఆశ్చర్యం కలిగించాలని"

"పోనీ...రేపుఉదయం బయలుదేరకూడదా?"

"ఈ రాత్రికి ఇంటకివెళ్ళి, రేపుఉదయం మెయిలుకి వెళ్లిపోవాలి"

చిట్టి బతిమాలటం మొదలు పెట్టింది.

"సమయం మించిపోయింది. లాభంలేదు" అన్నాడు కృష్ణమూర్తి గంభీరంగా.

చిటి కళ్ళలో నీళ్లునిండాయి. "నిన్నట్నుంచి ఎంతపిలిచినా సరిగా మాట్లాడనైనా లేదు. పాపిష్టిదాన్ని"

కృష్ణమూర్తి ఆమె చెంపల్ని అరచేతుల్లోకి తీసుకొని ముఖానికి ముఖం చేర్చాడు ఆమె వెన్నలా కరిగిపోయింది అతనిచేతుల్లో.

"ఈ బుద్ధి నిన్నట్నుంచీ ఏమైంది?"

చిట్టికళ్ళు అరమోడ్పులుపడే వున్నాయి ఆమె ఏమీ జవాబు చెప్పలేదు.

సముద్రపు అడుగుభాగానికి వెళితే ముత్యాలు దొరుకుతాయి చిటి చిరునవ్వుల్లో ముత్యాలు కురిశాయి.

హఠాత్తుగా చిటికి గుర్తొచ్చింది. తొందరగా యింట్లోకిపోయి ఈవిషయం చెప్పింది. అందరూ ఆశ్చర్య పడ్డారు.

ఇక చిట్టి తమకి దూరంగా వెళ్ళిపోతుంది. కాని సుభద్రమ్మకి తెలుసు. కృష్ణమూర్తి గట్టి మొనగాడు.





చర్మపు బాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధి చెందినది.

"రమణీస్ బేబి గ్రైప్"

తయారుచేయువారు

దిసౌత్ ఇండియన్

మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు

సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.



ఈ విషయమే చిట్టి తో అంది యిది వరకు. కాని కృష్ణమూర్తి విషయం ఆమె కేం తెలుసు. "దిగులు పడకు ఆయన మనిషి అట్లాఉన్నా, మాటలతో చురకలు అంటించటం బాగా వచ్చు" అంది చిట్టి.

"తరచు ఉత్తరాలు రాస్తూవుండండి" అని నిస్సంతోషంగా సాగనంపారు. దశరథ రామయ్య వద్దంటున్నా కారుదాకా వచ్చి "ఉత్తరాలు రాస్తూండు నాయనా" అని మాత్రం చెప్పారు.

* * *

రెండు నెలలు గడిచింది ఈరెండు నెలలూ చిట్టి. కృష్ణమూర్తికోసం కలవరించింది. అనుకోకుండా తన జీవితంమీద బలవత్తరంగా పనిచేసే ఒక వ్యక్తి ప్రభావానికి ఆమె తట్టుకోలేక పోతోంది

కాని ఆ ఊహావొత్తిడిలో ఊపిరి సలపని సుఖంవుంది. ఆ సుఖానికి సాన్నిధ్యం; సామీప్యం, సాయుజ్యం కావాలి.

ఆ మూడూ ఉన్నప్పుడు ఇక ఊహ ఎక్కడిది. ఊహాతీతమైన అనుభూతుల అంచుల్లో తేలిపోయే ఒక్క క్షణం...ఒక గంట...ఒక ఘడియ...ఒకరోజు యుగయుగాలుగా గడచి పోతుంది.

ఆలోచనకి అంతరాయం కలిగింది. బయట పోస్టుమేన్ కేక వినిపించింది—అది చిట్టికి కృష్ణమూర్తి రాసిన ఉత్తరం.

"చిట్టీ!—

పనివత్తిడిలో నీకు ఉత్తరాలు రాయటానికూడా తీరిక చిక్కటం లేదు. అందుకు ఏమీ అనుకోవు కదూ?

నీవు నేననుకున్నంత అమాయకురాలివి కావు నీకు కొద్దిగా ప్రపంచం తెలుసు. జీవితాన్ని నందనవనం చేసుకోగల శక్తి నీదగ్గర వుంది. ఇంతవరకూ మనిద్దరం వేరు వేరు పడవల్లో జీవన యానం చేస్తున్నాం. ఇప్పుడు సమాజం మన రెండు పడవల్నీ జంటగా కలిపి బంధించింది. ఇప్పుడు ఆ రెండో పడవనికూడా విడిచేసి, ఇద్దరం ఒకే పడవలో ప్రయాణం చేస్తే ఆ ప్రయాణానికి భద్రత ఎక్కువ వుంటుంది. కాని—

ఎవరు ఎవరి పడవలోకి వచ్చేట్టు? ఏది నీది? ఏది నాది? ఇక్కడే దాంపత్యానికి అగ్నిపరీక్ష వస్తుంది నీ నాల భేదం విడిచి ఏకమయ్యే అద్వైతభావం ఇద్దరిలోనూ కలిగిననాడే, జీవిత పరమార్థాన్ని సాధించిన వాళ్ళవుతారు స్త్రీ పురుషులు.

ప్రపంచ జ్ఞానం తెలిసిన నీకు, నేను పెదగా చెప్పవలసింది ఏమీ లేదు. నీవు త్వరలో నే యిక్కడికి వస్తావనుకుంటా.

జవాబు అవసరమనుకుంటే రాయి.

వుంటా.

ఇట్లు,

నీ కృష్ణమూర్తి"

ఉత్తరం సంగతి ఎట్లావున్నా చివరిమాట మాత్రం చిట్టికి చాలా కష్టం కలిగించింది. దాని అర్థం తన జవాబు ఆయనకి కావాలా? అక్కర్లేదా?

స్త్రీలు గడుసు వాళ్ళంటారు పురుషులు. కాని పురుషులు తెలివి తేటలు కలవారు కాబట్టి, తమ మాటలతో స్త్రీల హృదయాల్ని కోసేస్తారు.

ఉత్తరంలో ఏవో క్షేమ సమాచారాలుంటాయనుకున్న చిట్టికి అసలు ఆవిషయమే కనిపించలేదు.

నామకు ఇంట్లో అడిగారు "ఏంరాశాడు మీ ఆయన!" అని. "ఏవో మామూలు విషయాలు...విశేషాలేమీ లేవు" జవాబు చెప్పటం చేతకాలేదనిపించింది చిట్టికి.

* * *

ఆ సాయంత్రం జయా, చిన్నా మామిడి తోటలోకి వెళ్ళారు. పెద్దక్క, రాముడూ జగన్నాథం వాళ్ళవూరు వెళ్ళిపోయారు. మనోరమా, బుడీ ఆడుకోటానికి వెళ్ళారు. తల్లి వాకిట్లో ఊడ్చి ముగ్గు వేస్తోంది.

కొత్తగా పెళ్ళైన దగ్గర్నుంచి చిట్టికి చాలా వరకు రెస్టు ఇచ్చారు, పనుల విషయంలో. ఏమైనా చేస్తే కాస్త యింట్లో పనిమాత్రమే.

ఇంట్లో ఒంటరిగా కూర్చుని చిట్టి ఉత్తరం రాయటం మొదలు పెట్టింది.

"ప్రియమైన భర్తగార్కి చిట్టి నమస్కారములు.

మీరు రాసిన ఉత్తరం అందింది. జవాబు ఏం రాయాలో నాకు తెలీదు. మీరు రాసిన ఉత్తరానికలా జవాబు యివ్వలేకపోయినా, అసలు రాయకుండా వుండలేను గా. కాస్త ఆలస్యమైనందుకు నామీద నిష్ఠూరం వేస్తున్నారు. తప్పైతే క్షమించ గోరుతాను.

మీరు రాసిన విషయంలో నాకు నేనుగా ఏమీ చేయలేనిదాన్ని. మీదగ్గిరికి రావాలని నాకు మాత్రం వుండదా?

ఇచ్చట అంతా క్షేమం. అచ్చట మీరు కులాసాగా వున్నారని తలుస్తాను. చెల్లీ వాళ్లు మిమ్మల్ని ఎప్పుడూ తలుచుకుంటూ వుంటారు తరచు మీ క్షేమ సమాచారములు తెలియపరచ గోరుతాను ఇంతే సంగతులు.

చిత్తగించవలెను.

ఇట్లు,

మీ, చిట్టి.

ఉత్తరం పోస్టుచేసింతర్వాత చిట్టికి, ఆడది ఎప్పటికైనా మగవాడికి లొంగి పోవాల్సిందే ననిపించింది.

తను చదువుకుంటుండే రోజుల్లో చిట్టి మగవాళ్ళ లేకి బుద్ధులు చూసి, వాళ్ళంటే ఒక విధమైన అసహ్యం అలవరచుకుంది, క్రమంగా; పెండ్లి మానేసి, హాయిగా చదువుకొని స్వతంత్రంగా బ్రతకాలని అప్పుడప్పుడూ అనిపించేది. కాని, తన మూడవ ఫారంతో తండ్రి బలవంతంగా చదువు మాన్పించాడు అప్పటినుండి చిట్టి "తన ఊహలన్నీ కేవలం అనాచరణీయం" అని.

ఈ విషయంలో తన తెలివి తక్కువ తనాన్ని కృష్ణమూర్తి దగ్గరకూడా బయట పెట్టకుండా వుండలేక పోయింది.

ఒకనాడు కృష్ణమూర్తి అడిగాడు తమాషాకి. "నేను దొరక్కపోతే నువ్వు ఏంచేసేదానివి?"

"హాయిగా పెండ్లి మానేసి స్వతంత్రంగా బతికేదాన్ని."

"పంతులమ్మగానా?"

"ఏం?"

కృష్ణమూర్తి నవ్వుకున్నాడు.

చిట్టికి అర్థం కాలేదు.

"అంత హేళన దేనికి"

"అంత కోపం దేనికి పంతులమ్మగారూ?"

"అయితే అయ్యానండి"

"మీకు హిందీ వచ్చల్లే వుంది. నాకు కాస్త హిందీ పాఠాలు చెప్తారా?"

"ఆ"

సంభాషణ యింకా సాగుతూవుండగానే



తలుపు తోసుకుని బిలబిలా పిల్లలందరూ లోప లికి వచ్చారు. అక్కడితో సంభాషణ ఆగి పోయింది.

నిజంగా తనకి అప్పుడున్న అభిప్రాయం ఎంత హాస్యాస్పదమైనది.

లోకంలో ఏ స్త్రీ అయినా పురుషుడి అవసరం లేకుండా జీవించగలదా ?

జీవించగలదేమో ననుకున్న అభిప్రాయం క్రమక్రమంగా అనుమానాస్పదమై ఇప్పుడు ఒక నిశ్చయానికి వచ్చింది.

ఏ బలవత్తరమైన ఆకర్షణ ఈ బంధాన్ని యింత సుస్థిరం చేసింది ? స్త్రీ పురుషుడి సముఖంలో ఇంత బలహీనురాలు ఎందుకు అవుతుంది ! తనకి యిది కొత్త అనుభవం కాబట్టి అన్నీ విపరీతంగా కనిపించవచ్చు. కాని లోకం అంతా యింతేనా ?

తను లోకంలో ఎంతమందిని చూడటం లేదు ? ఎందరో పెళ్ళిళ్లు చేసుకొని భర్తలతో దూర దేశాల్లో కాపురం చేస్తున్న వారు లేరా ? అందాకా ఎందుకు ? తన స్నేహితురాలు సుశీల యిప్పుడు మద్రాసులో వుంది. దాని మొగుడికి అక్కడ ఏదో పత్రిక ఆఫీసులో పని. అది ఏటా వచ్చినప్పుడల్లా తల్లి దండ్రుల్ని ఇది ఇవ్వలేదు...అది పెట్టలేదు, అని దెప్పి పోడుస్తుంది. పాపం, వాళ్లు దాని పెళ్ళికోసం ఎన్నిపాట్లు పడ్డారు ! తిరిగిన వూరు తిరక్కుండా ఎన్ని ఊళ్లు వెతికారు. పెళ్ళికొడుక్కి ఒకటుంటే ఒకటుండదు. అన్నీ వుంటే అందదు. ఇవన్నీ కూడగట్టు కోవాలంటే తాతలు దిగివస్తారు. ఇవన్నీ ప్రతి ఆడపిల్లని కన్నతండ్రికీ జరిగే అను భవాలే. చివరికి దాని అదృష్టంవల్ల ఒక అంద మైన మొగుడే దొరికాడు. "అది అదృష్ట వంతురాలు" అన్నారు అంతా.

దాని పెళ్ళితంతు చూసిన తనకి భయం వేసింది. తన తండ్రి తన పెళ్ళికి ఎంత తిర గాలో ! తనకి ఎట్లాంటివాడు వస్తాడో... ఊహించుకుంటే భయం వేసేది.

* * *

ఏడాది గడిచింది. ఈమధ్య దశరథ రామయ్య తిరిగిన తిరుగుడికి అంతులేదు. అయినా ఆయనకి సరైన సంబంధం కనపడ లేదు చివరికి విసుగెత్తింది

ఎట్లాగో కర్తవ్యం నెరవేర్చుకోవాలని ఆయన ఆదుర్దా. చిట్టికి యింకా పెళ్ళి ఎప్పుడవుతుందోనని ఆరాటం.

ఎక్కడన్నా ఊళ్లో పెళ్ళిమేళం విన్న ప్పుడు, ఆ ఆనందం, ఆ వైభవం చూసి నప్పుడు చిట్టికికూడా అట్లాంటి ఆనందం అనుభ వించాలనిపించకపోలేదు. కాని అది తాత్కాలికమైన బలహీనత అనుకునేది చిట్టి.

ఎట్లాగైతేనేం ఒక సంబంధం వచ్చింది. తన బలహీనతవల్లనో, తల్లి దండ్రుల్ని భారా న్నించి విముక్తి చేయటానికనో ఆ సంబం ధానికి ఒప్పుకుంది చిట్టి.

పిల్లవాడు నల్లటివాడైనా అది వరకూ చూసిన రెండు సంబంధాలకంటే నయమే ననుకున్నారు అంతా. కానీ తానసలు ఆ అబ్బాయినే సరిగా చూడలేదు చిట్టి.

పెళ్లి అయిపోయింది

మూడునిద్దర్లకి వెళ్లేటప్పుడు అమ్మ చాటుగా కంట తడి పెట్టుకుంది తానప్పుడు అనుకుంది "ఆడబ్రతుకు అస్వతంత్రమైనది" అని.

ఇప్పుడు తనకి అయింది—

రేపు జయకీ, చిన్నకీ, మనోరమకీ, బుడ్డికికూడా అవుతుంది అంతా కాపరానికి వెళతారు ఒకొక్కక్కళ్ళ పెళ్లి చేసినప్పుడల్లా అమ్మ, నాన్న కంటతడి పెట్టుకుంటారు ఆనందంవల్లనో, దుఃఖంవల్లనో, అందరూ వెళ్లిపోయిం తిరువాత శూన్యమైన విశాలమైన యింట్లో ఒక్క అమ్మకి ఏంతోస్తుంది.

యుక్తవయస్సు వచ్చిన పిల్లకి పెళ్లిచేసి ఒక యింటికి పంపడం తండ్రి విధి. కష్ట సుఖాల్లో గుట్టుగా కాపరం చేయటం కూతురు కర్తవ్యం.

కొంతకాలం గడిచింది. చిట్టిని కాపరా నికి తీసికెళ్లటానికి మంచిరోజు నిర్ణయిం చారు. ఈ వార్త విన్న చిట్టికి ఒక విధమైన దిగులు, ఆనందంకూడా పట్టుకున్నాయి. అప్పుడు వచ్చింది ఒక పెద్ద ప్రశ్న.

ఇక తన జీవితం ఎట్లా సాగుతుంది ?

ఒకప్పుడు పెద్దక్క వేసిన ప్రశ్న యిప్పుడు తనకు తానుగా వేసుకుంది చిట్టి.

ప్రయాణానికి సిద్ధమై పెట్టెలు సర్దు తున్నారు. ఇంట్లో అందరూ అదోమాదిరిగా వున్నారు. బయట చిట్టి మామగారూ, తండ్రీ తొందర చేస్తున్నారు.

త్వరత్వరగా తల్లి చిట్టి కాళ్లకి పసుపు పూసి, ముఖాన ఇంత కుంకం పెట్టి, కొత్త చీర, పసుపు, కుంకుం, ఒళ్లో పెట్టింది.

గదిలోకి వెళ్లి కొత్తచీరకట్టుకొని బయ టికి వచ్చిన చిట్టిని తనివితీరా చూసుకుంది తల్లి.

బయటనుంచి మళ్లీ కేకలు వేశారు మొగ వాళ్లు. గబగబా బండ ఎక్కింది చిట్టి గావు కేకలు పెట్టి "చిట్టెక్కా...చిట్టెక్కా" అని ఏడుస్తున్న బుడ్డిని వాళమ్మ గట్టిగా పట్టు కుంది

బండి సాగింది. కొంతదూరం నడిచి మలుపు తిరిగింది. క్రమంగా బుడ్డి ఏడుపు అస్పష్టంగా కాస్త కాస్త తగుతూ వినిపి స్తోంది. ఇళ్లు ఒకొక్కక్కటే దాటిపో తున్నాయి.

ఇంతలో ఊరి బయటగా ఉన్న శివా లయం వచ్చింది ఊరు అక్కడితో అంత మైంది. చిట్టికి ఒక్కసారిగా దుఃఖం పెల్లు బికి వచ్చింది అంతవరకూ అణచిపెట్టిన దుఃఖం అప్పుడు తెంచుకుంది

బండీ కారు దగ్గిరికి చేరింది. కారు ఇంటి దగ్గిరికి చేర్చింది. మళ్లీ రిక్షా రైలు దగ్గిరికి చేర్చింది. రైలు కొన్ని వందల మైళ్ల దూరంలో తనకోసం ప్లాట్‌ఫారంమీద కనిపెట్టుకు చూస్తున్న కృష్ణమూర్తి దగ్గిరికి చేర్చింది

అప్పటికి చిట్టి హృదయం ప్రశాంతత చెందిన మిట్టమధ్యాహ్నపు కోనేరులా అయింది

ఆ రోజే చిట్టి ఉత్తరం రాసింది ఇంటికి. 'నేను ఇక్కడికి కులాసాగా చేరాను. వారు స్టేషను దగ్గిరికి వచ్చారు.

ఇక్కడ ఇలా అవీ బాగానే వున్నాయి. అన్నీ సౌకర్యంగానే వున్నాయి. జయనీ, చిన్ననీ, మనోరమనీ, బుడ్డినీ అడిగినట్లుగా చెప్పవలెను. కొద్దిరోజుల్లో మళ్లా విపులంగా ఉత్తరం రాస్తాను. ఇంతే సంగతులు.'

చిత్తగించవలెను.

ఇట్లు,

చిట్టి. ★


## తెల్లవెంట్రుక లుండవు

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుక లను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగానెరసివుంటే ఒక సీసా రు. 5-0-0; 3 సీసాలు రు. 12-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0. 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు.

Guarantee Supplied on Special request.

GENERAL LABORATORIES,

(P. W) P. O. Rajdhanwar (H. Bhag).



## నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము నిస్త్రాణ, విస్ఫోటక వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి అ 1-1-0

పి. వి. ఎ. అండ్ కో, (ఆయుర్వేద సమాజం) పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా.